చిన్న కథ:

# స్వాతంత్ర్య స్వరూపం

శారద

ఒకప్పుడు, ఒక పిల్లదేశం ఇంకో పెద్దదేశం నించి నానా అవస్థలుపడి స్వతంత్రం సంపాయించింది. ఆ పిల్లదేశంలో ప్రజలు స్వతంత్రం వొచ్చినందుకు గుర్తుగా ఓ స్వతంత్ర విగ్రహం చేయించి రాజధాని నగరంలో ప్రతిష్ఠించుకుందామని, తమ స్వతంత్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసారు. ప్రభుత్వంకూడా తమ ప్రజల ఆలోచన బాగానే వుందని తప్పదని, ఒక శిల్పిని పిలిపించింది. ఆ శిల్పి అఖండమైన కళోపాసకుడు. అదివరకు చాలా విగ్రహాలుచేసాడు. అతనుచేసే విగ్రహాలు జీవకళ వుట్టిపడుతూ వుండేవి. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఆ శిల్పి ఒక సుముహూర్తంలో, మంచి చలవరాయితో విగ్రహం చేసేందుకు వుపక్రమించాడు.

స్వతంత్రాన్ని ప్రజలు పోరాడి తెచ్చుకున్నారు గనక, స్వతంత్ర విగ్రహం, తమ పోరాటాల చరిత్రని ఎల్లప్పుడూ జ్ఞప్తిచేస్తూ, తమ సుఖవంతమైన స్వతంత్ర భవిష్యత్తును చూపుతో వుండే ఒక మహావీరుని విగ్రహంగా చెక్కమని వాళ్లు శిల్పికి తీర్మానాలు చేసిపంపారు. శిల్పి అలాగేనని ఒక మహావీరుని విగ్రహం చెక్కడం ప్రారంభించాడు.

కాని మొదట్నించీ, సామాన్య ప్రజలు పోరాటాలు చేసి స్వతంత్రం సంపాయిస్తే, తమ ప్రాబల్యం ఎట్లాగు మంటగలుస్తుందని భయపడుతూ వొచ్చిన డబ్బుస్వాములు, తమమీద అధికారం చెలాయిస్తున్న పరాయిదేశం డబ్బుస్వాములతో గుసగుసలూ, వికావికలూ చేసి అధికారం తమహస్తగతం చేసుకున్నారు. ఈ డబ్బుస్వాములు, "స్వతంత్ర విగ్రహం, ప్రజలకీ, నూతనంగా వొచ్చిన స్వతంత్ర ప్రభుత్వంపైన నమ్రత, విధేయతా నేర్పే చిహ్నంగానూ, అల్లరి ఆగం చేయకూడదని బోధించే గురువులాగూ ఉండాలి. అందుకని ఆ విగ్రహం, ఓ ప్రశాంత తపస్విలాగో, లేక సన్యాసిలాగో వుండాలి" అని శిల్పికి ఆజ్ఞాపించారు. శిల్పి "చిత్తం" అని మహావీరుడి విగ్రహం చెక్కినంతవరకు ఆపి, దాన్నే ఓ సన్యాసిరూపంలోకి చెక్కుతున్నాడు.

ఆ దేశంలోని డబ్బుస్వాముల్లోనే ఇంకా కొందరు మహాత్ములు, దేశాన్ని దాని ఆర్థికపరిస్థితిని తమ జేబుల్లోనూ, భోషాణాల్లోనూ ఇరికించుకునివున్నారు. వాళ్ళకి ఈ సలహాలేవీ నచ్చలేదు. వాళ్ళంతా కలిసి, "ఆ విగ్రహం, మన విశాల

మైన దేశంయొక్క స్వతంత్ర వ్యాపార ప్రతిపత్తిని విస్తరింపచేసేదిగా వోక గొప్ప ఓడల వర్తకుని రూపంలో వుండాలి" అని ఆ శిల్పికి ఆదేశం పంపారు. శిల్పి ఆ ఆదేశం కనకవుంటే ఆర్థికబలాన్ని వూహించుకుని "అలాగే బాబూ," అని తను తయారు చేస్తున్న సన్యాసి విగ్రహాన్ని ఓ గొప్ప వ్యాపారస్థుడివిగ్రహం గా మారుస్తున్నాడు.

కాని అసలు ప్రభుత్వంలోవుండే ప్రముఖులు ఇవన్నీ పనికిరావని, రెండు మూడు సబ్ కమిటీలూ, నాలుగైదు విచారణ సంఘాలూ వేసి, వాటి రిపోర్టులన్నీ కలిసి చదివి, వాటినన్నిటినీ తోసేసింతర్వాత "స్వతంత్రవిగ్రహం ప్రభుత్వంఎడ భక్తినీ, నమ్రతనీ నేర్పేట్టు వుండవల్సిందే కాని, అది సన్యాసిలాగు ప్రజలకి నీరసం బోధించేట్టువుండరాదు. అది ప్రజలకి ప్రభుత్వం యెడల భయమూ, భక్తినీ, శ్రద్ధా, గౌరవాన్నీ నేర్పే సాయుధ సైనికుడి విగ్రహంగావుండాలని ప్రభుత్వం భావిస్తోంది. నిజమైన ప్రజాశాంతినీ, ప్రజాస్వామికాన్ని కాపాడేది, ప్రభుత్వ సైన్యమే. అదీ కాకండా, ప్రజలలో కొందరు ఎల్లప్పుడూ అశాంతి, గుడ్డలని అల్లరుచేస్తో, ఆర్థిక సమానత్వం అని లేనిపోని ప్రచారంచేస్తో, ప్రజల ప్రశాంత జీవితాన్ని భగ్నంచేస్తున్నారు. అటువంటి వాళ్ళకి స్వతంత్ర ప్రభుత్వంలోనైనా వాళ్ళ ఆటలు సాగవని హెచ్చరిక తెల్పుతూ, స్వతంత్ర విగ్రహం ప్రభుత్వ సాయుధ సైనికుడి రూపంలో వుండాలి" అని బహిరంగప్రకటన ఒకటి చేసి, శిల్పికి హుకుం ఇచ్చారు, సైనికుడివిగ్రహం చెక్కమని. "అట్లాగే" అని శిల్పి తను ఇదివరలో చెక్కుతున్న వర్తకుడిరూపాన్ని సాయుధసైనికుని రూపంలోకి మార్చుతున్నాడు. ప్రభుత్వ సలహాని డబ్బుస్వాములు హర్షించారు; వ్యాపారస్థులు ఆహ్వానించారు. అటూ ఇటూ మాట్లాడే పెద్దమనుషులు ఆమోదించారు; ప్రజలు మాత్రం ప్రభుత్వ ధోరణికి ముక్కుమీద వేలు వేసుకున్నారు.

అయితే శిల్పి మాత్రం ఎడతెరిపి లేకండా శ్రమించి, స్వాతంత్ర్య విగ్రహాన్ని తయారుచేసాడు. ఒక సుదినమున స్వతంత్ర విగ్రహాన్ని రాజధానినగరంలో ప్రతిష్ఠించటానికి తీసుకు వొచ్చారు. అదివరకే తయారైన శిలావేదిక మైన స్వతంత్ర విగ్రహాన్ని వుంచారు. ప్రభుత్వ అధ్యక్షుడు స్వతంత్రాన్ని గూర్చి ఒక మహోపన్యాసం చేసిన తర్వాత, స్వతంత్ర విగ్రహానికి కప్పివున్న ముఖమల్ గుడ్డని తొలగించాడు. స్వాతంత్ర్య విగ్రహం ఆధునిక ఆయుధాలతో, సాక్షాత్కరించింది — భయంకరమైన దయ్యంరూపంలో.